



# తెగిన గొళ్లాలు

బమ్మిడి జగదీశ్వరరావు

ఇంకా చాలారోజులు ఉందనుకున్న కుసుమ పెళ్లి అంత తొందరగా దగ్గర పడిపోతున్నందుకు అలజడిగానే ఉంది ఆదిలక్ష్మికి. మరునాడు రాత్రికే ముహూర్తం. పెళ్లి పెద్దలై ఉండి, పెళ్లికుమార్తె తరపున కంకణాలు కట్టుకొనవలసి ఉండి ఇంత వరకూ ఊరు బయలుదేరకపోవడం అదోలాగా ఉంది ఆమెకి.

“అమ్మా! అక్క పెళ్లికి ఇంకెప్పుడెళ్తామే?... అమ్మా!...” ఆదిలక్ష్మి పైట గుంజుతూ అడిగాడు చిన్న కొడుకూ, పదేళ్లవాడూ అయిన రాజు. పెళ్లికి ఇంకా బయలుదేరనందుకు వాడికి కోపంగానూ, అంతకంటే బాధగానూ ఉంది.

ఆదిలక్ష్మి కొడుకు అడిగిన మాటకు సమాధాన మిచ్చే స్థితిలో లేదు. ఏదో అందని ఆలోచనలతో ఆందోళనలో పడిపోతోంది. బెంగగా, బితుకుగా ఉంది.

తల్లిని కుదుపుతూ రాజు మళ్లీ అదే ప్రశ్న వేశాడు.

“నువ్వొక్కడవూ వెళ్లిపోరా!” అన్న తల్లి ఎందు కలా మాట్లాడిందో రాజుకి అర్థంకాలేదు. చెప్పినా వాడికి అర్థంకాదు. చెప్పే ఓపికా ఆమెకి లేదు. ఏమనుకున్నాడో రాజు వీధిలోకి బాధగా వెళ్లిపోయాడు.

ఆదిలక్ష్మి ఆలోచనలకి మాత్రం అంతంలేదు. తను పెళ్లయి కొత్తగా కాపురానికి వచ్చిన రోజులు కళ్ల ముందర మెదిలాయి. ఆయనగారు రోజుకి సగం గంటలు ఇంట్లోనూ సగం గంటలు డ్యూటీలోనూ గడిపేసేవారు. డ్యూటీ ఎనిమిది గంటలే అయినా స్టీలు ప్లాంటుకు వెళ్లి రావడమంటే మరో నాలుగు గంటల ప్రయాణం. డ్యూటీ కంటే వెళ్లిరావడమే కష్టమనేవారు.

పెళ్లయిన కొత్తలో పెనిమిటి రోజంతా తనతోనే ఉండాలనిపించేది. అదే కోరిక అతనికీ ఉన్నా, ‘నిన్ను కట్టుకోకముందే ప్లాంటు నన్ను కట్టుకుంది,’ అని నిట్టూర్చేవారు. ఆ నిట్టూర్పులో కూడా వెళ్తూ వెళ్తూ తన్ను దగ్గరికి పిలిచేవారు. డ్యూటీకి వెళ్లే ముందు సినిమాల్లోలా ‘ముద్దు’ పెడతారేమోనని చాలాసార్లు చూసింది. కాని పిలిచిన ప్రతీసారి పెట్టించేవారు ఏమిటి? ముద్దు కాదు బొద్దుగా ఉండే తాళం కప్ప!

కటకటాలకి లోపల్నుండీ తాళం వేస్తూ, ‘పట్ట పగలు కూడా ఎందుకూ?’ అన్నట్లు చూసేది ఆదిలక్ష్మి.

“రోజురోజుకీ దొంగలభయం ఎక్కువవుతోంది. నా కోసం ఆలోచిస్తూ నీవాగదిలో వంటచేస్తుంటే ఇవతల ఎవడో వచ్చి ఇల్లు సర్దేస్తాడు,” సంజాయిషీ ఇచ్చాడు.

ఇలా అన్నిటికన్నా ముందు గుర్తొచ్చేది తాళం కప్ప. భర్తకి భార్య కంటే, భార్యకి భర్త కంటే... ఇద్దరికీ భగవంతుడి కంటే కూడా! ఇంటికి తలుపులు ఎంత అవసరమో, తలుపులకి గొళ్లెమెంత అవసరమో, గొళ్లేనికి తాళం కప్ప అంత అవసరం!

తాళం గొప్పతనాన్ని అప్పటికే కొంత అర్థం చేసుకోగలిగింది ఆదిలక్ష్మి. ఇంట్లో ఉండేవారంతా కుటుంబ సభ్యులే అయినా సూట్‌కేస్‌లకి, పెట్టెలకి తాళం ఎందుకేస్తారో తర్వాత తర్వాత అర్థమయింది.

ఇప్పుడు ఇంటికి తలుపులున్నాయి. తలుపులకి గొళ్లాలున్నాయి. గొళ్లాలకి బాంద్రకప్పంత తాళాలు

న్నాయి. అయినా పెళ్లికి వెళ్లాలంటే భయమే! భయముండదూ?! ఎంతటి తాళంకప్పనూ తలదన్నేలా తయారయింది మాయదారిలోకం! పగలయినా, రాత్రయినా ఒకటే. పాడయిపోయింది లోకం. ఎంతగా అంటే భర్త, నలుగురు మగపిల్లలూ అంతా ఉన్నా, తలుపులు తాళం వేసుకున్నా సరే ఏ అర్ధరాత్రో, అపరాత్రో ఎవడో దొంగవెధవ కిటికీలోంచి కర్రకి దోని కట్టినట్లు కొక్కెం కట్టి మరీ స్టాండుకున్న బట్టలు లాగేసి పట్టుకుపోయాడు. నయం చొక్కా జేబులో యాభై రూపాయలే ఉన్నాయి.

అదిగో అది మొదలు రాత్రులు పడుకునే ముందు కిటికీలు బిడాయించుకుని మరీ పడుకోవడమే! కరెంట్ పోయినా, దోమలు కుట్టినా, ఊపిరి సలపకపోయినా, వేడి ఆవిర్లతో రాత్రి కనురెప్పలు పడకపోయినా అలా తెల్లవారవలసిందే! మంచి గాలి కాదు, ఏ గాలీ పీల్చుకోలేని స్థితి. మొదట్లో కష్టంగా అనిపించినా తరువాత అలవాటుగా మారింది.

'పోలీసులున్నారెందుకు?' ప్రశ్నించుకుంది ఆదిలక్ష్మి.

'దొంగల్ని పట్టుకోవడానికి!'

తన సమాధానం తనకే నవ్వు తెప్పించింది. అసలీ పోలీసులు ఎవరికోసం? వీళ్లెవరికి కాపలా కాస్తున్నారు? తమ ఇంటికి కాపలా కాశారా? లేదే! ఈ వీధికీ ఈ వాడకీ? లేదే! మరి? పోలీసుస్టేషన్‌లకీ (స్టేషన్‌ని ఎవడెత్తుకుపోతాడు), బాగా డబ్బున్నవాడికీ, రాజకీయ నాయకులకీ, మంత్రులకీ కాపలా కాస్తారు! పోలీసులుండేది వాళ్లకోసమేనేమో?

చాలా బాధనిపించింది ఆదిలక్ష్మికి.

గత కొద్దిరోజులుగా నగరంలోనూ, చుట్టుపక్కలా జరిగిన కొన్ని సంఘటనలు, వాటిని నిరూపిస్తూ పేపర్లో ఫోటోలు, వార్తలు కళ్లముందు మెదిలాయి.

అసలీ దోపిడీలు, దొంగతనాలు, ఎందుకు జరుగుతున్నాయి? దొరికితే పులుసులోకి ఎముకలు కూడా మిగలవే! జైల్లో పెట్టి కొట్టి కొందరైతే అక్కడే నిజం చెప్పమని తన్నితన్ని చంపేస్తారు కూడానట! మరి ప్రాణాలకు తెగించి అందరూ ఎందుకు చేస్తారు? కొందరుంటే ఉండొచ్చు. తిండికి లేకనా? ఆకలి ఎంత పనైనా చేయిస్తుంది. అన్నమా? మరేమిటి?

ఆదిలక్ష్మి ఆలోచనల వల్ల అరగంట నుంచీ గొంతు చించుకుంటున్నది భర్త అని గ్రహించలేదు. ఆయన అరుగుమీద అసహనంగా కూర్చుండిపోయాడు. ఆటకు పోయిన రాజొచ్చి కేకేస్తే అప్పుడు చూసింది భర్తని.

జగన్నాథం ఇంటిలోపలికి అడుగు పెట్టడంతోనే అందుకున్నాడు. "ఎక్కడున్నావ్? కొత్తగా పెళ్లయిన ఆడకూతుర్లా ఆ ఆలోచనలేమిటి? లేకపోతే ఆ కొత్తగా పెళ్లవవలసిన జంట గురించి ఆలోచిస్తున్నావా? కుసుమని నీ కూతురనుకున్నావే? కాళ్లు కడిగి కన్యాదానం చేస్తేనేనా పుణ్యం వస్తుంది? అసలు కూతుళ్లు లేరని నీకంత బాధ ఎందుకూ అంట? అలాగయితే, మగపిల్లలు లేనివారికి వంశమేముందే? పైగా కొడుకు కొరివి పెట్టకపోతే, మరి మోక్షమేలేదట! నీకా నలుగురు కొడుకులున్నారు," అని ఆగిపోయిన భర్తని అర్థం కానట్లుగా చూసింది ఆదిలక్ష్మి.

అర్థమైనంత జీర్ణించుకొని, కుసుమ పెళ్లికి కట్నం తామే ఇస్తే కాళ్లు కడిగి కన్యాదానం చెయ్యొచ్చన్న చెల్లెలు, మరిది జ్ఞాపకం వచ్చారు. "డబ్బు దొరకలేదా?" అడిగింది ఆదిలక్ష్మి.

"డబ్బు దొరికింది. అది కాదు సమస్య," జగన్నాథం నుదుట ముడుతలు.

"మరి?" ఆత్రంగా అర్థంకాని ఆదిలక్ష్మి.

అప్పుడు చెప్పాడు జగన్నాథం. "కుసుమ వాళ్ల సంతానంలో మొదటిదట. జ్యేష్ఠపుత్రిక కాబట్టి, ఆ అమ్మాయికి తల్లిదండ్రులే కన్యాదానమిస్తే మంచిదట. మీ చెల్లెలికీ, మరిదికీ. ఇలా అందరూ తలో మాటా అంటే ఈ నిర్ణయానికి రావలసి వచ్చిందట. అయినా ఇంకా ఇద్దరాడపిల్లలున్నారు కదా! అని మనకి గుర్తు చేస్తూ రాశారు."

"రేపు పెళ్లి పెట్టుకొని ఈరోజు చెప్పడమేమిటి?" ప్రశ్నించింది ఆదిలక్ష్మి.

"...మనం వస్తామని చూస్తున్నారట. పెళ్లికార్యం తలమీద పెట్టుకొని రాలేకపోయారట. లేకపోతే వచ్చి చెప్పుండేవారట. మీ చెల్లెలయితే ఏడ్చిందట. పాత విషయమే మళ్లీ గుర్తు చేశారు. మనకి నలుగురు మగపిల్లలు, వాళ్లకి ముగ్గురు ఆడపిల్లలు. మనకి ఆడపిల్లలూ, వాళ్లకి మగపిల్లలూ పుట్టే అవకాశం ఇక ఎలాగూ లేదు కాబట్టి చంటిపిల్లల్ని అంటే మన రాజుగాణ్ణి వాళ్లకిచ్చి వాళ్ల అరుణని మనం తెచ్చుకుంటే బాగుండేదట. మనకి ఆడపిల్ల ముచ్చట, వాళ్లకి మగపిల్లవాడి ముచ్చట తీరిపోయేదట!"

జగన్నాథం మాటలకు మళ్లీ అడ్డు తగిలింది ఆది లక్ష్మి.

''ఇప్పుడా విషయాలన్నీ ఎందుకట? ఎప్పటి మాటలో మళ్లీ ఆడి, ఇచ్చిన మాట దాటిపోయామని దాయడానికా? అసలు కుసుమ నీ కూతురే! నువ్వంటే దానికి ఇష్టం. అదంటే నీకు ఇష్టం. తప్పిపోయి మా ఇంటిలో పుట్టిందిగాని... అయినా ఇప్పుడేమయిపో యింది? ఒక పేగు ఎరుసనా? నువ్వు నాకు రక్తం మిగిల్చితే కదా నేను పుట్టాను- అంటే అది నీ రక్తం పంచుకు పుట్టినట్టేనని మా చెల్లి మాయ కబుర్లు చెప్పింది. ఇప్పుడేమో...'' మరి మాటలు రావడంలేదు. దుఃఖం తెరలు తెరలుగా పొంగుకొస్తోంది.

జగన్నాథం భార్య అలా కుమిలికుమిలి ఏడ్చే సరికి శాంతంగా, సహనంగా, ఆలోచనతో మాట్లాడాడు.

''ఆదీ! ఇప్పుడేమయిందని? పాపం కుసుమ 'అమ్మ రాలే'దని నీకోసం ఏడుస్తోందట. వారం ముందొ స్తానని అన్నావుట- అదీ తను నెలరోజులు ముందు రమ్మంటే.''

ఆదిలక్ష్మి ఇంక జగన్నాథాన్ని మాట్లాడనీయలేదు. కళ్లు రెండూ రెండు మండలతో చిన్నపిల్లలా పులుము కుంటూ, ''అది నాకేమవుతుంది? వాళ్ల అమ్మానాన్నా ఉన్నారుగా!'' అంది.

''ఛ! అవేం మాటలు? పెద్దవాళ్లం మనం మనం ఏదో పడతాం. పిల్లల మనసు ఎందుకు విరచడం? అదే విషయం తనూ రాసి, వాళ్ల అమ్మానాన్నా లెటరు అందించిన వ్యక్తితో పంపించింది. మనం మాత్రం మన బ్బాయిని ఇంకొకరికి...'' ఆదిలక్ష్మి ముఖం చూసి ఆగిపోయాడు జగన్నాథం.

''అమ్మా! ప్లీజ్ అక్క పెళ్లికి వెళ్దామే!'' బ్రతిమిలాడి నట్టు తల్లి గడ్డం పట్టుకున్నాడు రాజు. 'సరే' అని ఆది లక్ష్మి అన్నదాకా విడువలేదు. తరువాత వాడి ఆనం దానికి అవధుల్లేవు.

''ఆదీ! ఆకలేస్తోంది అన్నం పెట్టు,'' జగన్నాథం అన్నాకే కూర్చున్న చోటు నుంచి లేచి నిల్చుంది ఆది లక్ష్మి. ముఖం చెరగుతో తుడుచుకొని భర్తకీ, కొడుక్కీ రెండు కంచాల్లో వడ్డించింది. అప్పుడే నడిపి కొడుకు వచ్చాడు. మళ్లీ వాడికి వడ్డించింది. అంతా భోంచేస్తుంటే తల మీద చేతులు వేసుకొని ద్వారానికి చేరగిలబడి పోయిందామె.

అందరి భోజనాలయినా, ఆదిలక్ష్మి ఇంకా ఏదో ఆలోచిస్తున్నట్టుగానే ఉంది.

జగన్నాథమే కదిపాడు. ''నువ్వూ భోంచెయ్యి. కలిపిన అన్నం వదిలేశాను. చప్పగయిపోతుంది,'' కంచాన్ని ఆమె ముందుకు తోశాడు.

ఆ వదిలిన కంచంలో మరికొంచెం అన్నం వేసుకొని, అందులోనే వారగా కూర వేసుకుంది.

ఆదిలక్ష్మి ఆ విధంగా వదిలిన ఎంగిలి కంచంలో తినడం అలవాటే! అసలు ఆ విధంగా అన్నం వదలక పోతే ఆమెకు మహాకోపం. తన తల్లి నుండి తనకా గుణం సంక్రమించింది. పెనిమిటి వదిలిన కంచంలోనే పెళ్లాం తినాలిట!

''ఇంతకీ ఇంట్లో ఎవర్నుంచి వెళ్దాం, ఎవ్వరూ లేకుండా ఇల్లొదిలి వెళ్తే రోజులసలే బాగులేవు,'' భర్త అన్న ఆ మాట ఆదిలక్ష్మికి అన్ని సమస్యల కంటే, పెద్ద సమస్యలా, అసలైన సమస్యలా అవుపించింది.

''తాళం వేసి వెళ్దాం,'' చిన్నాడు రాజు సలహా ఇచ్చాడు.

ఒకప్పటి తాళానికి ఇప్పుడు విలువలేదని తేలి పోయినట్లనిపించింది ఆదిలక్ష్మికి. 'తాళం వేశామన్న మాటేగాని ఎప్పుడు భయం లేదు గనక?' అనుకుంది.

''తాళం వేసినా మనిషుండాలి. రాత్రులెవరో పడు కుంటే సరిపోతుంది,'' భార్య పెదవి దాటి మాట రాక పోయేసరికి జగన్నాథమే అన్నాడు.

'తాళం పోయి మనిషొచ్చాడు. ఆ మనిషి ఉన్నా భయం లేదూ? ఇంట్లో ఇంటెడు మనుషులుండి రాత్రి ఏ పిల్లి దూకిన చప్పుడయినా అమ్మో ఏమిటి? ఎవ డొచ్చాడు అని నిద్రలేచి టార్చి వేసి కాచుక్కూర్చో లేదూ?' మళ్లీ తనలోనే అనుకుంది ఆదిలక్ష్మి.

''ఎవర్ని పడుకోమనడం? మన మనుషులుంటే బాగుండును. నమ్మకమయినోళ్లయితే సరి. ఇల్లు అప్ప జెప్పామంటే బాధ్యతున్నట్టు చూసుకోవాలి. ఇరుగూ పొరుగులో ఎవరు?'' మళ్లీ తనే అన్నాడు జగన్నాథం.

'మళ్లీ మంచిరకం మనిషి,' ఆదిలక్ష్మి ఆలో చనలు సాగలేదు.

భార్య మాట్లాడకపోయేసరికి ఇంకా కన్యాదానం గురించి ఆలోచిస్తోందేమోనని అనుకొని, ''పెళ్లికి వెళ్లాక పీటలమీద నీ కూతురు ఉండగానే, నీ చెల్లెల్నీ, మరిదినీ

కడిగేద్దువులే? ముందు ఇంట్లో ఎవర్ని పెడతామో ఆలోచించు,'' అన్నాడు.

అప్పుడు ఆదిలక్ష్మి నోరు విప్పింది. ''ఇదా పెళ్లిళ్ల సీజను. ఎవర్ని ఉండమన్నా అందరూ మాకూ ఉన్నా యని అంటున్నారు. అందుకే గద ఇంతవరకు వెళ్ల కుండా ఉండిపోయింది.''

''రేపే పెళ్లి రోజు,'' రాజు బాధ రాజుది.

''నువ్వుండిపోతావట్రా? వచ్చాక సినిమాకి తీసు కెళ్తాను,'' ఆట పట్టించాలని నవ్వుతూ కొడుకుతో అన్నాడు జగన్నాథం.

''ఆ... అబ్బా నేనుండను. ఉదయం అడిగితే అమ్మ నన్నొక్కడ్నీ వెళ్లిపోమంది,'' అమ్మ ఆర్డరయి పోయినట్టు గొప్పగా చెప్పాడు రాజు.

''అన్నాను కదా అని ఒక్కడవూ వెళ్లిపోగలవురా? అయినా నువ్వేం వస్తాదువా నిన్ను కాపలా వుంచి మేం వెళ్లడానికి? నీ అన్నలు ముగ్గురున్నారెందుకు? అవసరా నికే మనుషులు కరవు. గొప్ప చేస్తున్నాడు మీ పెద్దన్నయ్య- సెలవులు దొరకలేదని ఉత్తరం మాత్రం రాశాడు. మీ చిన్నన్నయ్య అదిగో, ఇంట్లో ఉన్నాడంటే వాడు మీ చిన్నయ్యకి ఇష్టమైన కొడుకు. పని సాయం చేస్తాడట. వాణ్ణి తీసుకెళ్లకపోతే దెబ్బలాడతారు. మీ చిన్న చిన్నన్నయ్య ఉన్నాడంటే చదువని, కోచింగ్‌లని రానే లేదు,'' విసుగ్గా అంది అలసిపోతూ ఆదిలక్ష్మి.

కొన్ని క్షణాలు గడిచాక, ''అవునే, పక్కింటి పాపాయమ్మ కొడుకుని ఇంట్లో పెట్టి వెళ్తే?'' నెమ్మదిగా జగన్నాథం.

ఆదిలక్ష్మి మాత్రం నెమ్మదిగా చెప్పలేదు సమా ధానం. ''వాడా? వాడాండీ? మీకేంటి బుద్ధుండే మాట్లాడుతున్నారా? ఆ ఛండాలుడు వాళ్ల నాన్న జేబులే కొట్టేస్తాడట. వాళ్లమ్మ ఏ పోపులడబ్బాలో దాచినా, కడుపులో పెట్టుకున్నా అసలు తినే పదార్థమే ఉంచ డట! అవునండీ! కాకపోతే ఆ సాయమ్మ కూతుర్ని వీడిన్ని సార్లు సినిమాలు చూసింది కాక, దాన్ని తీసుకెళ్తా డట. మనమే జీతాలెత్తి నెలకో సినిమా అయినా...'' చెపుతూనే ఉంది.

''ఆపవే, అంత గట్టిగా చెప్పాలా? వాళ్లు మన మీదకి యుద్ధానికి రావడానికా? ఆ సంతంతా ఎందు గ్గాని, ఇంకెవరున్నారో చెప్పు?'' మధ్యలో అడిగాడు జగన్నాథం.

''అవున్రా నడిపోడా, మీ స్నేహితుడు కామేసో?'' ఆదిలక్ష్మి అడిగింది రెండో కొడుకుని.

''వాళ్ల మామయ్య కొడుకు పెళ్లికి వెళ్లాడమ్మా,'' చెప్పాడు.

''మరి నారాయణ, తేజ వాళ్లో?'' తండ్రి అడి గాడు.

ఏమనుకుందో ఆదిలక్ష్మి వెంటనే, ''వాళ్లొద్దు. వద్దులే, లేకపోతే లేదు,'' అంది. ఈ సమస్య ఎప్పటికి తెగుతుందా అని చూస్తున్నాడు రాజు.

''అవునూ, పెరటి అంబుజం వాళ్లకి తాళం ఇస్తే?'' నడిపోడు నసిగాడు.

వెంటనే అందుకుంది ఆదిలక్ష్మి. ''అలా వాడు కాస్సే ఒగ్గేసుకున్నాడు మందని. ఈ గుంటముండ పాప లందరు ఎక్కితొక్కేరూ? తల్లితో వస్తేనే కళ్లెర్ర చేస్తున్నా వినకుండా టీవీ తిప్పేసి ఇవి లాగేసి అవి లాగేసి- అయినా ఒట్టప్పుడే ఆయమ్మ అదియ్యొదినా ఇది య్యొదినా అని ఒకదాని కొచ్చి రెండు తీసుకెళ్లేది. అలాటిది తాళాలిస్తే హార్లిక్స్, పాలగుండ, పంచదార, నూనె... అన్నీ ఉన్నాయింట్లో పోపుల్దగ్గిర్నించి...''

''మరి ఏదీకాకుండా, ఎవరూ లేకుండా ఎలాగ?'' ప్రశ్నించాడు జగన్నాథం.

పెద్ద సమస్యొచ్చి దేశం మీద మనుషులే లేన ట్టుంది వారికి. మనిషి- ఒక్క మనిషి కనిపించడం లేదు.

కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి.

''అయినా మన దగ్గరేముంది ఎత్తుకుపోవడా నికి? అయినా బెంగ. గుండె నిబ్బరానికి ఎవరో వుండాలి. లేదంటే పెళ్లికి వెళ్లినా ధ్యాసంతా ఇటే ఉంటుంది,'' స్వగతంగా పైకే అంది ఆదిలక్ష్మి.

''మొన్న మంగ... కొళాయి దగ్గరిల్లు... మంగ పెళ్లికి వాళ్ల సొంత అన్నయ్యే ఇంట్లో ఎవరూ లేరని పెళ్లికి వెళ్లలేదు. ఎవరయినా ఏమిరా మీ చెల్లి పెళ్లికి వెళ్లలేదూ? అంటే పెళ్లి జరిగినరోజు ఇంటికి తాళం వెయ్యకూడదు. దీపం దేవుడికి పెట్టి ఉంచాలి అని మాట్లాడుతున్నాడు. అది నిజమేనామ్మా!'' అడిగాడు నడిపోడు.

ఏం మనసు మార్చుకుందో, ''ఏమోరా, అయితే నువ్వుండిపోకూడదూ?'' టక్కున బతిమాలుతున్నట్లు గా అంది ఆదిలక్ష్మి.

వాడు రెండు నిమిషాలు మాట్లాడలేదు. తర్వాత అన్నాడు, "సరే లేకపోతే ఏం చేస్తా? నన్నుండమంటే ఉంటాను."

రాజు, "అన్నయ్య రాడా?" అని ఆందోళనతో ముఖం వెళ్లబెట్టాడు.

జగన్నాథం ఏదో ఆలోచిస్తున్నాడు. ఆదిలక్ష్మి మాత్రం, "నాయమ్మ... నా యమ్మే," అని మెచ్చుకుంది. "కావాలంటే మేం వచ్చిన వెంటనే నీవు వెళ్లి వారంరోజులు ఉండివద్దువుగాని, సరేనా?" అంది. వాడు మాట్లాడకపోవడం, తల్లి మెచ్చుకోవడం- నడిపోడు ఖాయం అన్నట్టుంది.

ఇరవై రెండేళ్ల కొడుకుని ఇంట్లో ఉంచడానికి ఆదిలక్ష్మి ధైర్యంగా ఉన్నా, జగన్నాథం మాత్రం అందుకు సిద్ధంగా లేడు. మనసు పరిపరి విధాలా ఆలోచిస్తోంది.

జగన్నాథానికి కొడుకు వయసులో ఉన్న గతం గుర్తుకు వచ్చింది. పెళ్లికి ఒక సంవత్సరం ముందవ్వచ్చు. ట్రైనింగ్ పిరీడ్‌లో ఒంటరిగా ఉన్నప్పుడు ఊరు కొనిచ్చేది కాదు. నరాల్లో ఏదో కదలిక, ఆరాటం. అంతా ఓచోట చేరి మధు పుస్తకాలు సంపాదించి చదవడం, మధు కథల్లో బొమ్మలు చూస్తూ కాలాన్ని వెళ్లబుచ్చడం. మొదట్లో ఆనందం, తర్వాత అసహ్యం, మళ్లీ ఒంటరిగా ఉన్నప్పుడు అవే దృశ్యాలు గుర్తుకొచ్చి నిద్రపట్టేది కాదు. చదువు మీద మనసు నిలిచేది కాదు. డబ్బుల్లేక గాని ఉంటే వెళ్లేవాడేమో! అంతగా వెళ్లాలనిపించేది. ఒక్కోసారి వద్దు అనిపించేది. ఏది ఏమయినా బుర్ర పాడైంది. అలానే చదువూ కాస్త చెడింది.

మరి ఈ కాలం కుర్రోళ్లని అసలు పట్టలేం. సినిమాకని చెప్పి స్నేహితుల ఇళ్లు ఖాళీగా దొరికితే చాలు, బ్లూ ఫిల్ములూ మందు పార్టీలూ! ఈ వయసులో మతి తప్పితే జీవితపు గతి తప్పినట్టే!

అంతే! "నడిపోడు ఇంట్లో కాపలా ఒక్కడూ ఉండడానికి వీల్లే"దన్నాడు జగన్నాథం.

ఆదిలక్ష్మికి అర్థంకాలేదు. అదే విషయం అడిగింది.

"నీకు తెలీదు ఊరుకో," అన్నాడు.

అంతలోనే, "పాపం వాడ్ని ఒక్కణ్ణే ఏం వదిలి వెళ్తాం మనమంతా? ఎలాగూ వాళ్లిద్దరూ లేరు," అన్నాడాయన.

ఆదిలక్ష్మి భర్త మాటలు విని ఏమనుకుందో ఏమో కాసేపు ఆలోచించి, సరేనంది. "అయినా మన దగ్గరేముంది? ఏమి తీసుకుపోతాడు ఎవడైనా?" ఆ మాట అవసరమైనప్పుడూ, కానప్పుడూ అంటూనే వుంది.

'ఏదైతే అదే అయ్యింది," అనుకున్నారు.

అప్పుడు దోపిడీలు, దొంగతనాల గురించి కదిలింది. రాజు మధ్యమధ్యలో ప్రశ్నలేస్తూ, వాళ్ల పాఠంలో దొంగలు చివరికి మంచివాళ్లయినట్లు చెపుతుంటే, ఆదిలక్ష్మి ఆగలేక, "ఆ... అది కథ," అంది.

'కాదు నిజమే,' అనాలనుకున్నాడు రాజు. కాని మళ్లీ తల్లి వాడికా అవకాశమివ్వలేదు. తన చిన్నతనంలో వాళ్ల ఊళ్లో జరిగిన దొంగతనాల గురించి చెప్పింది. అప్పుడు దొంగలు తక్కువట. ఇంతలా పెచ్చుమీరి పోలేదట. అథవా ఎవడో దొంగతనం చేసి దొరికితే, పోలీసులకి అప్పజెప్పేవారు కాదట. అసలు పోలీసు ఊరికి ఒక్కడూ ఉండేవాడు కాదట. అప్పుడే దేశం బాగుండేదట. ఇప్పుడు పోలీసులే జైల్లో నుండి దొంగల్ని వదిలి దొంగతనాలు చేయిస్తున్నారట. దొరికినకాడికి వాటాలు వేసుకుంటున్నారట. లోకమిలా అయిపోతున్నందుకు భగవంతుణ్ణి తిట్టిందిసారి ఆదిలక్ష్మి.

"మరి దొంగలు దొరికితే పోలీసులకప్పజెప్పక ఏం చేసేవారు?" మధ్యలో తల్లి వదిలేసిన విషయం తాను మాత్రం వదల్లేదు. రాజుకి ఆసక్తిగా ఉంది.

"ఆ... దొరికితే వాడి పాపం పూరా పండిపోయి నట్టే! ఇక చూస్కో, మంగల్ని పిలిచి నున్నగా గుండు గొరిగించి, ఆ గుండు మీద పిండిచుక్కలు పెట్టి, ముఖానికి మసిబొగ్గుతో నామాలు దిద్ది, కుండ మట్టు మెడలో దించి, స్తంభానికి కట్టి, గుండు చితగ్గొట్టి, గాడిద ఎక్కించి ఊరేగించేవారు. మేం అప్పుడు చిన్నగుంటలం కదా వెనక పరిగెట్టేవాళ్లం. అన్నట్టు చెప్పటం మరిచిపోయాను. ఆ దొంగోడి మెడలో పిడకల దండవేసి మరీ..." కళ్లెదురుగా జరుగుతున్నట్టు చెప్తోంది ఆదిలక్ష్మి.

"తరువాత దొంగోడేం చేసేవాడు?" చిన్నాడి ప్రశ్న.

"ఇంకేటి చేస్తాడు? ప్రాణం పోయినా ఫరవాలేదు, పరువుపోతే ఆ బ్రతుకు ఎందుకు? ఎందులో పడి చావక!" రోతగా అంది ఆదిలక్ష్మి.

ఆ చెప్పే విధానానికి జగన్నాథం కూడా నోరు వెళ్లబెట్టాడు. తర్వాత తేరుకొని, "బుద్ధిగా చదువుకోక వీధిలో ఎక్కడ చూసినా నువ్వేనన్నమాట!" వ్యంగ్యంగా అన్నాడు.

"మరి మీ ఊర్లో ఇలాంటివి జరిగాయేంటి?" చిన్నపిల్లలా అడిగింది ఆదిలక్ష్మి.

"ఏంటి అమ్మా నీదొక ఊరూ, నాన్నదొక ఊరా?" అర్థంకాలేదు చిన్నాడికి.

"మా ఊరు మీ అమ్మమ్మ వాళ్ల ఊరు. మీ నాన్న ఊరు మీ నాయనమ్మున్న ఊరు," కొడుకు సందేహం తీర్చేసింది ఆదిలక్ష్మి.

"మరి నాన్నా! మీ ఊళ్లో దొంగతనమేమన్నా జరిగిందా?" చిన్నాడీసారి తండ్రినడిగాడు.

జగన్నాథం మాటాడకపోయేసరికి ఆదిలక్ష్మి అంది. "ఆయనేం చెపుతారు? వాళ్ల ఊర్లో దొంగతనం జరగనట్టు ఎలా చూస్తున్నారో చూడు."

"ఏంటి ఒక్క దొంగతనమూ జరగలేదా?" వాడి కెందుకో చాలా ఆశ్చర్యంగా ఉంది.

"ఆ... దొంగలు పడని ఊరంటూ లేదు," నమ్మ కంగా చెప్పింది ఆదిలక్ష్మి. చిన్నాడి ఆశ్చర్యం తొలగి పోతోంది. తండ్రిని చెప్పమని గుంజాడు.

జగన్నాథం చెప్పడం ఆరంభించాడు. "ఆ... మా చిన్నప్పుడు మా పక్కింట్లో దొంగలుపడి అన్ని సామాన్లు ఉన్నా ఏదీ పట్టుకుపోకుండా వంటగదిలో దూరి అన్నం, కూర అన్నీ కడుపునిండా తిని కుండ పగలగొట్టి పోయారు."

చిన్నాడికి తండ్రి చెప్పింది చప్పగా తోచింది.

"దొంగలెక్కడి నుండో కుండకూలి కట్టుకొని రారు. ఆ వాడలో వాళ్లూ, ఇరుగూపొరుగోళ్లంతే," ఈ మాట అంటూ తన ఇరుగూ పొరుగూ, పెరటి ముందల వాసన వాళ్లని ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంది. ఎవరె లాంటి వాళ్లో ఏ పుట్టలో ఏ పాముందో మళ్లీ భయం వేసింది ఆదిలక్ష్మికి.

ఈ దొంగతనాలు, దోపిడీలు మాట్లాడాక ఇంటికి తాళం వేసి పెళ్లికి వెళ్దామన్న పెనిమిటితో పేచీపడింది ఆదిలక్ష్మి. చివరకు విసిగిపోయిన జగన్నాథం తనే వుంటానని, పిల్లలిద్దర్నీ తీసుకొని భార్యని ప్రయాణం కమ్మన్నాడు.

అప్పటికే సాయంత్రమవుతోంది. ఈ ఆలోచన బాగానే ఉన్నట్లనిపించింది ఆదిలక్ష్మికి.

"మీరుంటే ఇంక భయమేమిటి? పిల్లలు నాకు తోడుంటారు," అంది. కంకణాలు కట్టుకొని కన్యా దానం ఇచ్చుకోడానికి అయితే ఇద్దరుండాలిగాని ఇప్పుడొక్కరు వెళ్లినా ఫరవాలేదు అందుకే మనసు స్థిమితపడింది.

జగన్నాథం ఆదిలక్ష్మిని బయలుదేరమన్నాడు. ఆదిలక్ష్మి ముఖం కడుక్కొని చీర మార్చుకొనేలోపు ఆలోచన మారిపోయింది.

"ఏమండీ! నాకయితే వెళ్లాలని ఉంది. కాని ఇప్పుడే సాయంత్రమైపోయింది. ఊరు చేరేసరికి ఏ రాత్రి పదకొండో, పన్నెండో. కాలాలు చూస్తే బాగా లేవు. వస్తువులు తీసేసి రుమాల్లో చుట్టి బొడ్లోనో, జాకెట్లోనో దోపుకున్నా ఈ చెవుల్లోవి, ముక్కుల్లోవి చాలు, ఆ దారిని కాచినవాడికి మెడలో పుస్తెలు చాలు- పుటు క్కున తెంపుకుపోవడానికి! ఆ తరువాత అర్రెంటే రాదు... బుర్రంటే రాదు!" భయాన్ని వెలిబుచ్చింది ఆదిలక్ష్మి.

"సరే, అయితే పొద్దున్న వెళ్దువు. ఉండిపో," అన్నాడు జగన్నాథం.

ఆదిలక్ష్మి కట్టిన కొత్త చీర విప్పి పాత చీర కట్టు కుంది.

పిల్లలు నీరసించిపోయారు.

ఆ రాత్రి-

చిన్నాడికి రేపు వెళ్లబోయే ఊరిని, పెళ్లిని తలుచు కొని నిద్రపట్టింది కాదు.

నడిపాడు అంచనాకు అందని లోకాన్ని జానా బెత్తుల తన మెదడుతో కొలిచి, ఇంక ఆలోచించలేక నిద్రపోయాడు.

జగన్నాథానికి ఆరోజు జరిగిన చర్చ, భార్య తీరు గుర్తుకొచ్చి ఒకింత నవ్వు, ఒకింత నిరాశతో చాలాసేపు గడిపి అర్ధరాత్రి దాటాక నిద్రలో జోగాడు.

అర్ధరాత్రి అయినా ఆదిలక్ష్మికి కూడా నిద్ర రాకుండా ఉంది. కాసేపు కన్యాదానం గురించీ, ఆ ఆశ నిరాశయినందుకూ బాధపడింది. తర్వాత పెళ్లి ప్రయాణం గురించి ఆలోచించింది.

తనొక్కర్తే వెళ్తే భర్త రానందుకు అంతా తనని తిట్టరూ? తిడితే తిట్టనీ? లేకపోతే ఇంటి దగ్గరెవరుం

టూరు? రేపు పెందరాళే లేచి వంట చేసేస్తే ఆయనకి భోజనానికి ఇబ్బంది ఉండదు. రేపు గడిచిపోతుంది. ఎల్లుండికి మరి? ఛీ! ఈయనకి వంట రాదు. ప్చ్! ఆ ఎదురింటి వనజాక్షిని కసిన్ని బియ్యం పొంగించి ఇమ్మంటే ఇస్తుంది. అమ్మో! వద్దు, అవిడసలే బావగా రంటూ సరసాలకి పోతుంది. తనుంటేనే జంకదు. లేనప్పుడు ఇంకేమన్నా ఉందా? ఆయన ఉన్నారని తెలిస్తే కావాలనే వస్తుంది. లేరు కదాని చెప్పి కూర ఇస్తుంది. ఏదో అంటుంది. ఇక చాలు ఈయన ఊరు కుంటారా, దాని మాటలకి, ఆ వగలాడి చిన్నెలకి? ఈ మగాళ్లని నమ్మకూడదు. మెత్తగుండే కొంపలు ముం చేస్తారు. ఏముంది? ఇద్దరూ ఒకసారి ఆ అవకాశం దొరికితే ఇంక వదలుతారా? తన కొంప కూలిపోదూ? కొల్లేరు కాదూ?

ఆదిలక్ష్మికి భయమేసింది. చెమట పట్టింది. భర్తను వదిలిపెట్టకూడదనుకుంది. వెళ్తే ఇద్దరూ కలి సైనా వెళ్లాలి, లేదా తనయినా ఉండిపోవాలి. ఆయన్ని మాత్రం ఒంటిగా ఇంటికి కాపలా ఉంచకూడదు. అప్పుడే భర్తను లేపి ఆ విషయం చెపుదామనుకుంది. కాని ఆయన నిద్రలో ఉన్నారు. 'మొద్దు నిద్ర' తిట్టు కుంది. పెద్ద ఆపద తప్పినట్లు ఊపిరి పీల్చుకుంది. తరువాత ఆమెకు నిద్ర పట్టింది.

గోడకున్న గడియారంలోని ముళ్లు నవ్వు కున్నాయి.

చిన్నాడు తెల్లవారుఝామున లేస్తూనే ఇంటం దర్నీ లేపేశాడు.

ఆదిలక్ష్మికి రాత్రి ఆలోచనా, ఆచరణ గుర్తుకు వచ్చి బద్ధకం ఎగిరిపోయింది. లేచి కూర్చుంది. బద్ధకం గా ఉన్న భర్త అటూ ఇటూ దొర్లుతుంటే, "ఏమండీ! మీరుండడానికి వీల్లేదు. నేనే ఉండిపోతాను. మీరు వెళ్లండి. గౌరవం దక్కుతుంది. లేదంటారా ఇద్దరం వెళ్దాం. అంతే!" తెగ్గొట్టినట్లు చెప్పింది.

జగన్నాథం మాట్లాడబోయాడు. ఆమె అతనికా అవకాశం ఇవ్వలేదు.

తెల్లవారిపోయింది గాని, జగన్నాథం ఆశ్చర్యం నుండి తేరుకోలేదు.

ఆదిలక్ష్మి తెల్లవారేసరికి తన అభిప్రాయం ఎందుకు మార్చుకుందో జగన్నాథం ఆలోచనలకి అంద లేదు. భార్యనొక వంక కనిపెడుతూనే ఉన్నాడు.

పిల్లలిద్దరూ అప్పుడే స్నానాలు చేసి బట్టలు కూడా తొడిగేశారు. ఆదిలక్ష్మి కూడా స్నానం చేసి ఎందుకనో మరి కొత్తచీర కట్టుకుంది. జడ అల్లుకుంటూ, "బయలుదేరుతారా? ఇప్పుడు బస్సెక్కితే మధ్యాన్నం భోజనాల టైముకి చేరుకోవచ్చు," కేక వేసింది.

జగన్నాథం పక్కమీద నుంచి లేస్తూ, "మరి ఇంటి దగ్గరెవరుంటారే?" అర్థం కానట్లు ముఖం పెట్టాడు.

"ముందు బాత్‌రూంకి వెళ్లి స్నానం, అన్నీ చేసి రండి," మనిషిని లేపి కూర్చోబెట్టింది ఆదిలక్ష్మి. జగన్నాథం చేసేదిలేక స్నానం, అన్నీ చేసుకొచ్చి, "ఇంట్లో సామానుపోతే నాకు తెలీదు. ఏది జరిగినా నన్నొద్దు, అ..." తాటించినట్టుగా అన్నాడు.

ఆదిలక్ష్మి ముఖంలో రంగులు మారడం గొంతులో కనిపించింది. "మీరు పిల్లల్ని తీసుకు వెళ్లి రండి. నేనుంటానన్నానుగా, నేనుంటాను!" చివరికి వచ్చేసరికి మాట గొంతులోనే ఉండిపోయింది. దుఃఖానికి ముందు గొంతు ఎలా పూడుకుపోతుందో అలా ఉంది. తల దించిందే కాని ఎత్తడం లేదు.

ఇవన్నీ జగన్నాథం గ్రహించకపోలేదు. అయినా తను బయటపడకుండా మాట్లాడుతున్నాడు.

"మీ చెల్లెలి కయితే ఏం చెప్పమన్నావ్? మరెం దుకు, ఆ కొత్త దంపతుల్ని అత్తవారిల్లు అడుగు మోపి వచ్చాక, మన ఇంటికి రమ్మని పిలుపు చేస్తాను. నువ్వు పెళ్లికి రాకపోయినా చూసినట్టుంటుంది, సరేనా?"

జగన్నాథం మాటకు ఆదిలక్ష్మి నుండి అస్సలు జవాబు లేదు. తల భారమైనట్టు క్రిందికి దించేసి వుంది. పెద్ద ఊపిరి మాత్రం బుసబుస వినిపిస్తోంది. ఇంక లాభం లేదని ఆదిలక్ష్మి దగ్గరగా వెళ్లి అరచేత్తో బలంగా గడ్డం పట్టుకు ఎత్తాడు. ఊహించినదానికంటే ఎక్కువగా ఆదిలక్ష్మి కళ్లల్లో జలపాతం ఉరుకుతోంది. ఆ సమయంలో జగన్నాథం గొంతు పెగల్లేదు. చిన్నాడికి మాత్రం తండ్రేదో తప్పు చేసినట్టు తోచింది.

"ఆదీ! నువ్వన్నట్టు మనింట్లో దొంగలు పడితే ఏముంది- పడనీ! మరెప్పుడూ జన్మలో ఈ ఇంటికే కాదుకదా ఈ వాడకే రాడు," నవ్వించాలని ప్రయత్నిం చాడు జగన్నాథం.

కాని ఆమె నవ్వలేదు. పైటతో కళ్లు తుడుచు కుంది.

"బయలుదేరు. బస్సు తప్పిపోతాం. ఫస్టు బస్సు దొరుకుతుందిలే. వేగం. ఆ చిన్నాడి కోసం. వాణ్ణి కూడా

ఏడిపించకు లే!'' సముదాయిస్తున్నట్లు అనునయంగా అన్నాడు జగన్నాథం.

చిన్నాడు తల్లి కళ్లల్లోకి అమాయకంగా చూశాడు.

అప్పుడు మనిషి కాగలిగింది ఆదిలక్ష్మి. కాని ఎందుకో తన చర్యకు తనకే తలచుకున్నకొద్దీ సిగ్గేస్తోంది.

కన్నీటి చారలు తుడుచుకొని పౌడరు అద్ది కాటుక, కుంకుమ పెట్టుకొని అరగంటకి రెడీ అయింది ఆదిలక్ష్మి.

అప్పుడు జగన్నాథం ఒక ప్రశ్న వేశాడు.

''కుసుమ పెళ్లికని మొదట ఇరవైవేలిచ్చాం. మరి మిగతా పదివేలు పట్టుకోనా? మానేనా?'' ఆ ప్రశ్నలో మనం పెళ్లిపెద్దలం కాము అన్న స్ఫురింపు ఉంది. ఆ విషయం తలుచుకొంటే ఆదిలక్ష్మికి మళ్లీ వెళ్లాలని పించలేదు. కాని మళ్లీ తను బయలుదేరి ఉండిపోవడం బాగోదనిపించింది. ''మీ ఇష్టం,'' అంది.

''లేదు, నువ్వే చెప్పు...'' తనే నిర్ణయం తీసుకోలే నట్టుగా అన్నాడు జగన్నాథం.

కాస్సేపు ఆగి, ''మనకి కాళ్లు కడిగి కన్యాదానం చేసే హక్కివ్వనప్పుడు మన డబ్బుతో వాళ్లకింక పనే టుంది? ఆ పదివేలూ బీరువాలో అలా ఉంచేయండి,'' అన్న ఆదిలక్ష్మి మాటే శిరోధార్యమయింది.

అప్పటికి అన్ని తలుపులూ, కిటికీలూ మూసే శారు పిల్లలు. సీలు చేసినంతగా బిడాయించారు. ఇంటి లోపల, పెరడున రెండు, బయటి వీధి గుమ్మానికి ఒకటి మొత్తం మూడు తాళాలు పెట్టి బయలుదేరారు.

బస్ రెడీగా ఉంటే ఎక్కడం, కదలడం ఒకేసారి జరిగిపోయాయి. చిన్నాడికిప్పుడు ఆనందంగా ఉంది. నడిపాడు ముందు సీట్లో కూర్చున్న అమ్మాయిని తల్లీతండ్రీ గమనించకుండా జాగ్రత్తపడుతూ చూస్తు న్నాడు. తర్వాత సీట్లో ఆదిలక్ష్మి, జగన్నాథం పక్కపక్కనే కూర్చున్నారు.

బస్సు కొంత దూరం పోయాక జగన్నాథం ఆది లక్ష్మి ముఖంలోకి చూశాడు. కన్నీటిచారికలు పౌడరు మాటున అస్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎక్కువసేపు చూస్తే ఏమయినా అనుకుంటుందని ఆ సమయంలో భార్య వంక చూడడానికి కూడా భయపడ్డాడు.

ఎండాకాలమయినా ఉదయపు గాలి చల్లగా ఆహ్లాదంగాఉంది. బస్సు పెద్ద రద్దీగా లేదు. కండక్టరు టిక్కెట్లు కట్ చేసి, కూర్చొని వాటి నెంబర్లు రాసు కుంటున్నాడు. బస్సు వేగం అందుకుంది.

చిన్నాడు రాజు దృష్టి బస్సు గోడల్ని తడిమింది. వాడు ఎర్రగా కనిపిస్తున్న అక్షరాల్ని పైకే చదువు తున్నాడు. అంతవరకూ కొడుకు చదివిన వాక్యాల్ని పట్టించుకోని ఆదిలక్ష్మి అప్పుడు మాత్రం ఉలిక్కి పడింది.

'దొంగలున్నారు జాగ్రత్త', 'మీ సామాన్లు మీరే భద్రపరచుకోండి!' ఆ రెండు వాక్యాలూ ఆమె చెవిలో రొద పెడుతున్నాయి.

అటుపైన ఆదిలక్ష్మి ధ్యాస ఇంటివేపు మళ్లింది. ఇరుగూపొరుగూకైనా చెప్పకుండా వచ్చేసినందుకు ఏదో తప్పు చేసినట్లనిపించింది. 'ఎంత గాభరాపడ్డా వచ్చే ముందు ఒక్క కేక వేసి చెప్పుండాల్సింది!' అనుకుంది. 'తాళం సరిగ్గా వేశామా? గొళ్లెం వదిలివేయలేదు కదా? పిల్లలు వెనకింటి అరదండ పెట్టారా? కిటికీలు మూశారు. మరి బీరువా తాళాలు ఎక్కడ పెట్టారు,' అనుమానాలు అంతకంతకూ ఎక్కువవుతున్నాయి.

''బీరువా తాళాలు ఎక్కడ పెట్టారు? అసలు తాళం వేశారా?'' పెనిమిటిని అడిగింది ఆదిలక్ష్మి.

''తాళం వేశానే. అది అందులోనే ఉంచాను, తాళం చెవులు పరుపు కింద పెట్టా,'' చెప్పాడు జగన్నాథం.

అలా తాళాలెందుకు వదిలేశారని అడగాలనిపిం చింది ఆదిలక్ష్మికి. కాని బస్సులో ఏ దొంగ వెధవయినా వింటే? అంతే, నోరు మూసుకుంది. ఆలోచనలు ముసురుకున్నాయి.

తాళాలు మెడలో తాడుకి పెట్టుకుంటే బాగుణ్ణు అనుకుంది. పదివేలున్నందుకు భయం ఎక్కువవు తోంది.

అసలు ఒకప్పుడు జగన్నాథం ఆ వాడలో చీటీలు వేసేవాడు. నెలనెలా డబ్బు పోగు చేసేవాడు. కాని ఆదిలక్ష్మి చీటీలు వద్దంది. ఆ లాభాలు వద్దంది. ఇంట్లో చీటీ వేస్తే తను ఉండనంది. చీటీ కావాలో, తను కావాలో తేల్చుకోమంది. మొదట జగన్నాథానికీ అర్థం కాలేదు. తర్వాత తన భయం చెప్పింది. ముష్టిముండ ఊరు మారిపోతోందట. ఇప్పటికీ ఆ వాడంతటికీ ఫలా నోళ్లు చీటీ వేస్తున్నారని తెలిసిపోయిందట. అంచేత ఎవులకయినా కళ్లగ్గసం అవుతుందట. మగమనిషి రాత్రి డ్యూటీలకని వెళ్తే, అయినా పగలయినా రాత్రయినా ఎవరి బుద్ధి ఎలా మారుతుందో? ఆ డబ్బుంటే నేనుం

డను- పెద్ద తగువే అయిపోయింది మొగుడూ పెళ్లాలకి. వారంరోజులు మాటలు కూడా లేవు.

మరిప్పుడు ఇంట్లో డబ్బు వదిలేసి వచ్చెయ్యడం బెంగగా ఉంది.

బస్సు నాలుగైదు స్టాపులు దాటాక రద్దీ ఎక్కు వయింది. అది పెళ్లిళ్ల సీజన్ కావడం వల్ల అందరూ కట్నాలు, బంగారం గురించి మాట్లాడుకుంటున్నారు. ఎవర్నైనా పిలిచి మీ ఇంటి దగ్గర ఎవర్నైనా వుంచి వస్తున్నారా అని అడగాలనిపించింది ఆదిలక్ష్మికి. కాని అడగలేదు. బయటకు చూస్తున్న భర్తని తట్టి, "రాత్రి పెళ్లయిపోగానే రేపు తెల్లారగట్టే ఫస్టు బస్సుకి వచ్చేద్దాం ఎలాగయినా," చెప్పింది ఆదిలక్ష్మి. 'అలాగే' అన్నట్లు తలూపాడు జగన్నాథం.

"ఈ ఒక్కరాత్రి గండం గడిస్తే అదే చాలు," స్వగతంగా అనుకుంది. 'అయినా మన దగ్గరేముందని ఎవడయినా వస్తాడు,' మళ్లీ అనుకొని గుండె నిబ్బరం చేసుకొనే ప్రయత్నం చేసుకుంది. ఆ నిబ్బరం ఎంతో సేపు ఉండడం లేదు.

ఆ మధ్యాహ్నానికి జగన్నాథం దంపతులు పిల్ల లతో ఊర్లో బస్సు దిగారు. పెళ్లి ఇల్లు చేరుకున్నారు. భోజనాలవుతున్నాయి.

ఆదిలక్ష్మి చెల్లెలు అనసూయ చూసింది. "చుట్టా లొచ్చారు భోజనాలు పెట్టండ్రా, తినేస్తే మరొక గంటలో బస్సుంది," అనేసి ఆగకుండా వెళ్లిపోయింది. చెల్లెలి మనసు గ్రహించింది ఆదిలక్ష్మి. జగన్నాథం ఆమె కోపానికి నవ్వుకున్నాడు.

చిన్నాడు భోజనాల దగ్గరుండే వాళ్లకి నీళ్లు పొయ్యడానికని జగ్గు తీసుకువెళ్తున్నాడు. నడిపాడు అటుకేసే నడుస్తున్నాడు.

అప్పుడే వచ్చాడు ఆదిలక్ష్మి మరిది నారాయణ. వీళ్లను చూస్తూనే అన్నాడు- "మీరూ పిల్లల్ని కన్నారు. పెళ్లి కాని చెయ్యడం మానేస్తారా? పిలవడం మానే స్తారా? మేమూ సెలవు దొరకలేదనో, బస్సులు దొరక లేదనో చెప్పలేమా?"

"అదికాదు తమ్ముడూ, సెలవూ దొరికింది, కాని ఇంట్లో ఎవర్నుంచి రావడానికీ ఎవరూ లేరు. కనీసం రాత్రి పూటయినా కాపుంటే రావడానికి," పరిస్థితిని అంతకంటే వివరించలేకపోయాడు జగన్నాథం.

ఆ మాట వింటూనే గడపలో కూర్చున్న ముసల్డి, నారాయణ తల్లి, "ఆ పదెకరాల రైతువి. తోటా, దొడ్డా, పంటా కాపా? పోని బక్కా బడుగా? కోళ్లా గొర్రెలా? ఏటున్నాయని పొద్దుబోతే కట్టలేదనో, ముయ్యలేదనో బెంగ? తాళం వేసి రావడానికి?" దీర్ఘం తీసింది.

పట్టణం సంగతంతా వివరించాలని ఆదిలక్ష్మికి అనిపించింది. అంతలో అనసూయ అంది, "దాని కూతురయితే అది ఎందుకు రాదు? ఒక్క పేగు ఎరు సని తేడా చూపుతుంది," నిష్ఠూరంగా ఉందామాట.

ఆదిలక్ష్మి ఆ మాటతో ఆగలేకపోయింది. గుండెలో అణిచిపెట్టుకున్న దుఃఖాన్ని కాయలేక పోయింది. అంతే! "కుసుమకి కాళ్లు కడిగి కన్యాదానం చేసే హక్కు నాదన్నావు. ఆడపిల్లలు లేనిదాన్నని చాలా కనికరించావు. చెల్లివయితేనేమి? తల్లిలా అర్థం చేసు కున్నావు అక్కని. కూతుర్లు లేకపోయినా నేను గొడ్రాల్ని కాదే!" ఆదిలక్ష్మికి మరి మాటలు రావడం లేదు, కళ్లమ్మట నీళ్లు తప్ప.

"... ఊరంతా పెద్దకూతుర్ని..." చెప్పబోయింది అనసూయ.

అరుగుమీది ముసల్ది లేచి, "నువ్వాగే. మిగతా ఇద్దరూ ఆడపిల్లలు కారే? నీకు నచ్చినదాన్ని అట్టుకు పోయే... ఎళ్లే!" గొంతెత్తి అంది.

"...అ... ఇప్పుడిలా అంటారు. దాన్ని తీసుకో మన్నట్టే తర్వాత ఇదిగిలాగే, అయినా ఎవుల బిడ్డ ఆల బిడ్డ. ఆ పుణ్ణెమూ వద్దు, మీరే మూటగట్టుకు పొండి," ఏడుస్తూనే అంటోంది ఆదిలక్ష్మి.

జగన్నాథానికి ఎలా ఓదార్చాలో అంతుపట్ట కుండా ఉంది.

సరిగ్గా అప్పుడే వచ్చింది కుసుమ, పెళ్లికూతురు గదిలోంచి. ఆదిలక్ష్మి గమనించలేదు. కుసుమే దగ్గరగా వచ్చి, "అమ్మా!" పిలిచింది.

"నేను మీ అమ్మను కానే! నాకు కూతుళ్లు లేరు గా," మరింత ఎక్కువయిపోయింది ఆదిలక్ష్మి ఏడుపు. ఏడుస్తూనే కుసుమ రెండు చేతులూ ఒడిలో పెట్టు కుంది. జనం పోగయిపోతున్నారు. పెళ్లిల్లు కదా, ఇంక అడిగేదేముంది?

జగన్నాథానికి ఈ పరిస్థితి అంతా చికాకుగా వుంది. 'నోర్ముయ్యి,' అని భార్యని హెచ్చరించాలను

కున్నాడు. మళ్లీ అంతలోనే జాలి కూడా కలిగిందామె మీద.

కొంచెంసేపట్లో పరిస్థితి సర్దుకుంటుండగా నారాయణే అన్నాడు. "వదినా! లెగు పురోహితుడ్ని పిలుస్తాను. అన్నయ్యా, మీరు కంకణాలు కట్టుకుందురు," అని అనసూయ ముఖం వంక చూశాడు.

"అక్కా! లే... బావా! అందరూ పెద్దకూతురు, తొలిసూలు పిల్లని అన్నారనిగాని దాని ఆశ చెడగొడదామని నాకు లేదు. ఇంకిద్దరు మాకెలాగూ ఉన్నారు," అని జగన్నాథంతో అని భర్తని పురోహితుడ్ని పిలుచుకు రమ్మంది అనసూయ. పురోహితుడు వచ్చాడు. కాని కంకణాలు కట్టుకోవడానికి ఆదిలక్ష్మితో పాటు జగన్నాథమూ అంగీకరించలేదు. అనసూయ అక్కనీ, బావనీ బ్రతిమిలాడింది. నారాయణ కూడా.

"నేనూ మనిషినే! ఒకరి ఆశ తీసెయ్యడమని కాదుగాని, మీరు కట్టుకున్న కంకణాలు ఇప్పెయ్యడం ఏమంత సబబుకాదు. తర్వాత మీరన్నట్టు ఇద్దరు పిల్లలున్నారు. ఏదో అయితే అవుద్ది. అయినా మేం ముందొచ్చుంటే ఎలా ఉన్నో... ఇల్లొదిలి రావడం అయ్యింది కాదు," ఖచ్చితమైన తన నిర్ణయాన్ని చివరగా చెప్పింది ఆదిలక్ష్మి. భార్య మాటలకు జగన్నాథమూ సంతోషించాడు.

వాతావరణం సానుకూలమయినందుకు పెళ్లి సందడి మరింత ఎక్కువయింది.

కంకణాలు కట్టుకున్న అనసూయ, నారాయణలు కార్యంలో మునిగిపోయారు. అక్కడ కాసేపున్నాక జగన్నాథం వీధిలోకి వెళ్లిపోయాడు. ఆదిలక్ష్మి ఆలోచిస్తోంది. కొంచెం ముందొచ్చి ఉంటే బావుణ్ను, అయిందేదో అయిపోయింది అనుకుంది.

కుసుమే వచ్చి పెదతల్లిని జడ వెయ్యమని అడిగితే, జడతోపాటు పెళ్లి ముస్తాబూ చేసింది.

పెళ్లి ముహూర్తం దగ్గర పడింది. పెండ్లి కుమారుణ్ణి, పెళ్లికూతుర్ని కూచోబెట్టి పురోహితుడేవో మంత్రాలు చదువుతున్నాడు. ఎన్ని ఘట్టాలు జరిగినా దూరం నుంచి చూస్తున్న ఆదిలక్ష్మి కాళ్లు కడిగి కన్యాదానం చేసేటప్పుడు మాత్రం చూడలేకపోయింది. చూసినంతలో కళ్లనీళ్లు తిరిగి మసకగా అనిపించి ఎవరైనా చూస్తారని తల దించేసుకుంది. జగన్నాథం మాత్రం భార్యని గమనించాడు. కాని గమనించనట్టే నటించాడు. ఆ సమయంలో తను చూశాడని గమనిస్తే ఆమె దుఃఖమేం ఖర్మ, ఏడుపు అందుకుంటుందని తెలుసు మరి!

పెళ్లయి ఈడులవీ చదివింపులయేసరికి, తూరుపు తెలతెలవారుతోంది. ప్రయాణాలు కావల్సిన వాళ్లు కొందరు సిద్ధపడుతుంటే, మరికొందరు కుర్చీల్లో కూలబడే కునికిపాట్లు తీస్తున్నారు.

జగన్నాథానికీ, ఆదిలక్ష్మికీ మళ్లీ సమస్యొచ్చి పడింది. ఇద్దరూ కూర్చొని ఒక కొలిక్కి రావడానికి ప్రయత్నిస్తున్నారు. కుసుమ పెళ్లి కనిచ్చిన ఇరవైవేల రూపాయల గురించి. కన్యాదానం తాము చేయలేదు కాబట్టి ఆ డబ్బు గురించి అడగాలనే అనిపించింది భార్యాభర్తలిద్దరికీ. మొదట కొంచెం తటపటాయించినా సరే, డబ్బు వాళ్లు మాత్రం ఉత్తినే ఇస్తారా? మనమూ వదిలెయ్యకూడదనుకున్నారు. రేపు తమ పిల్లలకీ ఉద్యోగమొచ్చి డబ్బు కట్టవలసి వస్తే వీళ్లు ఈ డబ్బు ఇస్తారా? అయినా కష్టపడిన సొమ్మయినా మాటకి కట్టుబడి ఇచ్చారు. ఆ మాట వాళ్లు తప్పారు కాబట్టి, తమ డబ్బులు తాము తీసుకోవాలని నిశ్చయానికి వచ్చి అదే విషయం అడిగారు.

నారాయణ, అనసూయ ఆశ్చర్యపడలేదు. సమయానికి తమకు అందవలసిన సొమ్ము అందలేదని బాధపడ్డారు. "మీరు ఇరవై వేలు ముందుగా సర్దడం వల్ల మేలు చేశారని, అసలు పెళ్లి మీ మూలంగానే అయింద"న్నారు. "అయితే ఇంకా డబ్బు సరిపోలేదని, మీ నుండి పదివేలు వస్తాయని ఆశ ఉన్నా అడగడానికి నోరు రాలేకపోయింద"ని, "అలా అని కూతురు పెళ్లి వదులుకోలేం కదా," అన్నారు.

"ఇంతకీ ఎప్పుడిస్తారా ఇరవై వేలు?" ఆదిలక్ష్మి దంపతులిద్దరూ అడిగారు.

"వీలున్నంత తొందర్లోనే తీర్చేస్తా"మని అన్నారేగాని, ముందు ఇంకా పిల్లలున్నారని కాని, కన్యాదానం గురించిగాని ఎత్తలేదు అనసూయ దంపతులు.

అందరూ కష్టపడితేనే డబ్బు వస్తుందని, ఆ డబ్బే మంచయినా, చెడయినా చేస్తుందని, వడ్డీ ఇవ్వకపోయినా 'ప్రామిసరీ నోటు' తప్పకుండా కావాలన్న అక్కనీ, బావనీ చూసి మాత్రం ఆశ్చర్యపోయారు. ఇంకేమీ మాట్లాడకుండా కోరినట్టే కాగితాలు తెప్పించి

నోటు రాయించి ఇద్దరూ ఇరవై వేలకు సంతకాలు పెట్టి ఇచ్చారు.

నోటు అందుకునేటప్పటికి ఒకరోజున్నరయింది. పెళ్లికొడుకు, పెళ్లికూతురు ఇల్లు కదిలి వెళ్లడం, చుట్టాలు గందికి, ఇన్నింటి మధ్య కూడా రాతకోతల పని అయింది. ఈ రెండ్రోజులూ అక్కచెల్లెళ్లుగాని, తోడన్నదమ్ములు గాని ఎక్కువగా మాట్లాడుకోలేదు కూడా, ఏదో అవసరమైతే తప్ప. ఆదిలక్ష్మికి, జగన్నాథాల కయితే తింటున్నప్పుడల్లా పరాయివాళ్ల ఇల్లులానే తోచింది. ఆ రెండ్రోజుల్లో అనేక దఫాలు మనసు మారి పోతే మరుక్షణమే మామూలయేది.

ఆవేళ మధ్యాహ్నం జగన్నాథం కుటుంబం బయలుదేరింది. ఉండమని ఎప్పుడూ పోరే అనసూయ కూడా ఆదిలక్ష్మిని ఏమీ అనలేదు. నారాయణయితే ముఖంలోకే చూడడంలేదు.

ఆదిలక్ష్మి కూడా ఆడపిల్లలిద్దర్లో ఎవరినీ బయలు దేరమనిగాని, రమ్మనమనిగాని అనలేదు. జగన్నాథం ఆ విషయమే మరిచిపోయాడు. చిన్నాడికి ఇంటి వాతావరణంలో మార్పు కొట్టొచ్చినట్టు అగుపించి బాధనిపించింది. నడిపాడు పిన్ని, చిన్నాన్నల ప్రేమకు దూరమైనట్టుగానే ఉన్నాడు.

ఎప్పుడూ దిగబెట్టే నారాయణ బస్సు దగ్గరికి రాకపోయినా కిమ్మనకుండా వెళ్లి బస్సెక్కి కూర్చున్నారు పిల్లలతో జగన్నాథం దంపతులు. బస్సు కదిలిపో యింది. ఊరు విడిచి పెట్టేసింది. అందరి గుండెలూ భారంగా ఉన్నాయి. జగన్నాథం, ఆదిలక్ష్మి ఎందుకనో ఒకరి మొఖాలు ఒకరు చూసుకోలేక పోతున్నారు. చిన్నాడికి వెళ్లినంత సంతోషంలో సగమయినా లేదు వచ్చేటప్పుడు.

దిగాల్సిన ఊరు వచ్చినదాకా ఆలోచనల్లో పడి ఇంటి గురించి భయం వెయ్యకపోయినా, మళ్లీ మొదలయింది. అక్కడున్న రెండ్రోజులూ రాతకోతల్లో పడి మరచినా ఇప్పుడు భయం రెట్టింపవుతోంది. 'నమ్మకం లేని చోట పదివేలు ఎలా వదిలివెళ్లామా,' అన్న ఆలోచన రాలేదు. ఆ దంపతుల గుండెలు భయం భయంగా, బితుకు బితుకుగా ఉన్నాయి. అడుగులు వడివడిగా వేస్తూ ఉన్నా తడబడుతున్నాయి.

ఇల్లు దగ్గర పడింది. పరిగెత్తుకు వెళ్లారు. ఇంటికి తలుపులు, తలుపులకు గొళ్లాలు, గొళ్లానికి తాళం ముద్దుగా, బొద్దుగా నిశ్చలంగా ఉంది.

తలుపుల గొళ్లాలు తెగలేదు.

కాని ఎక్కడో మరేవో గొళ్లాలు- అవి తెగి పోయాయి.

*ఆంధ్రప్రభ వారపత్రిక, 23 & 29 నవంబర్ 1994*

